సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 4 । ఆగస్టు । 2025



మరో మహిళ మోజులో పడి

ఇంటి నుంచి గెంటేయడంతో ఓ మహిళ ఇద్దరు పిల్లలతో సహా భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది. 8లో▸



పరిశ్రమల ఏర్పాటుకు..

పరిశ్రమల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. 8లో▸



నకిలీ సర్టిఫికేటుగాళ్లు..!

నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో రోజుకో కోణం వెలుగులోకి వస్తోంది. విచ్చలవిడిగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి



నియామక పత్రాలు అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

చేవెళ్ల: బీసీల హక్కులు, 42శాతం రిజర్వేషన్ సాధనకోసం బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి పనిచేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో చేవెళ్ల మండల బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను నియమించి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి స్థానంలో బీసీలకు ప్రాధాన్యత ఉండాలన్నారు. బీసీల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బీసీ సంక్షేమ సంఘాన్ని గ్రామస్థాయి వరకు బలోపేతం చేయాలని సూచించారు. చేవెళ్ల మండల బీసీ సంక్షేమ శాఖ నూతన అధ్యక్షుడిగా కమ్మెట గ్రామానికి చెందిన శేఖర్‌గౌడ్, ఉపాధ్యాక్షుడిగా మల్కాపూర్ గ్రామానికి చెందిన చాకలి వెంకటేశ్‌ను నియమించి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండమీది వెంకటయ్య, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు వెంకటేశ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అండగా నిలబడాలి



సమావేశానికి తరలిన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా నిలబడాలని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి అధికారి ప్రతినిధి శ్రీధర్ వర్మ అన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్ పోరాట సమితి సమావేశానికి షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న ముదిరాజ్ కులస్తులను ప్రభుత్వం బీసీ–డి నుండి బీసీ – ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో పూర్తిగా వెనకబడి ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యా రంగాల్లో ముదిరాజ్‌లు రాణించాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 12న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండె యాదయ్య, అంజయ్య, మానపాటి ప్రదీప్, వేణుగోపాల్, శ్రీనివాస్, మహేష్, రంజిత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరో నలుగురికి తీవ్ర గాయాలు



విజయ్ కుమార్ (ఫైల్)

నందిగామ: శుభకార్యానికి బైక్‌పై వెళ్తున్న దంపతులను కారు ఢీకొట్టిన ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. శంషాబాద్ మండలం పెద్దషాపూర్ గ్రామానికి చెందిన విజయ్ కుమార్ (30), శిరీష దంపతులు. ఆదివారం రాత్రి బైక్‌పై మండల పరిధిలోని నర్సప్పగూడలో జరిగే ఓ శుభకార్యానికి బయలు దేరారు. నందిగామలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న చౌరస్తా వద్ద నర్సప్పగూడకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా రహదారి పక్కన ఆగిఉన్న డీసీఎం వాహనాన్ని సైతం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న విజయ్ కుమార్ మృతి చెందగా, శిరీష తీవ్రంగా గాయపడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

చంద్రకల్ వాసికి డాక్టరేట్

దౌల్తాబాద్: మండల పరిధిలోని చంద్రకల్ గ్రామానికి చెందిన దేవయ్య, శకుంతల కుమార్తె సరిత ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీలో ఆదివారం డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో నేల నాణ్యత పెరుగుదలపై అసిస్టెంట్ ప్రొఫెసర్ జయశ్రీ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు వివరించారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా సరితను కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందించారు.

అక్కడోటి.. ఇక్కడోటి!

అస్తవ్యస్తంగా జిల్లా పరిపాలనా వ్యవస్థ


- ఒక్కో చోట.. ఒక్కో ప్రభుత్వ కార్యాలయం
- ఏ ఆఫీసు ఎక్కడుందో అంతా అయోమయం
- చిన్నచిన్న పనులకు కిలోమీటర్ల కొద్దీ ప్రయాణం
- తిరిగి వేసారి ఉసూరుమంటున్న బాధితులు



పద్మారావు నగర్‌లో తూనికలు కొలతల శాఖ కార్యాలయం



శివరాంపల్లిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం



మేడ్చల్ జిల్లా బాలానగర్‌లో జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మేడ్చల్ జిల్లా బాలానగర్‌లో రంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు.. కూకట్‌పల్లిలో విద్యుత్ ఆర్‌ఆర్‌జోన్ సీజీఎం ఆఫీసు.. పద్మారావునగర్‌లో తూనికలు కొలతల శాఖ.. బేగంపేటలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు.. సనత్‌నగర్‌లో రోడ్లు భవనాలు.. ఖైరతాబాద్‌లో జెడ్పీ, పంచాయతీరాజ్.. రెడ్‌హిల్స్‌లో నీటిపారుదలశాఖ.. మాసబ్‌ట్యాంక్‌లో పశుసంవర్ధకశాఖ సహా జిల్లా ఉపాధి కల్పనశాఖ.. నాంపల్లిలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్స్.. అబిడ్స్‌లో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు.. జిల్లా సహకారశాఖ.. రాజేంద్రనగర్ శివరాంపల్లిలో వైద్య ఆరోగ్య శాఖ.. కొంగరలో కలెక్టరేట్.. ఇలా ఒక్కో ప్రభుత్వ కార్యాలయం ఒక్కోచోట ఉండిపోయింది. జిల్లాల పునర్విభజన తర్వాత అప్పటి ప్రభుత్వం ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో రెవెన్యూ పరిధిలో సమీకృత జిల్లా భవన సముదాయం నిర్మించినప్పటికీ ఇప్పటి వరకు చెట్టుకొకటి.. పుట్టకొకటి అన్నట్లుగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు ఒకే గొడుగు కిందికి రావడం లేదు.

44 ఎకరాలు.. రూ.58 కోట్లతో భారీ భవనం

జిల్లాల పునర్విభజనలో భాగంగా పరిపాలన సౌలభ్యం పేరుతో ఉమ్మడి రంగారెడ్డిజిల్లాను అప్పటి ప్రభుత్వం మూడు జిల్లాలుగా విభజించింది. ఆయా జిల్లాల్లో కొత్తగా సమీకృత జిల్లా సముదాయాలను నిర్మించింది. కొంగరకలాన్‌లో 44 ఎకరాల విస్తీర్ణంలో రూ.58 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక భవన సముదాయాన్ని నిర్మించింది. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ శాఖలన్నీ ఇప్పటికే ఆయా జిల్లాల్లోని కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. కానీ రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు మాత్రం ఇప్పటికీ హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే కొనసాగుతున్నాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతుండటం, జిల్లా కేంద్రానికి వాటిని తరలించే ఆలోచన అధికారులకు లేకపోవడంపై గందరగోళం తలెత్తుతోంది. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కలెక్టరేట్‌లోని అందుబాటులో ఉంటారని భావించి చాలామంది ఇప్పటికీ కొంగరకు చేరుకుంటున్నారు. తీరా ఆయా శాఖల అధికారులు అక్కడ లేరనే విషయం తెలిసి ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు.

ఫీల్డ్ విజిట్ పేరుతో దుమ్మా

కొత్తగా నిర్మించిన కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖలతో పాటు సివిల్ సప్లయ్, విద్య, వ్యవసాయ శాఖలు మినహా కీలకమైన ఇంజినీరింగ్ విభాగాలన్నీ ఇప్పటికీ నగరంలోని ఇరుకైన అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం వాటికి సొంత భవనాలు నిర్మించినప్పటికీ ఇంటికి దూరమవుతుందని, హెచ్‌ఆర్‌ఏలో కోత పడుతుందనే ఆలోచనతో మెజార్టీ ఉద్యోగులు అక్కడికి వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. తూనికలు కొలతలు, ఉపాధి కల్పన, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల అధికారులు ఫీల్డ్ విజిట్ పేరుతో రోజుల తరబడి ఆఫీసుకే రావడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతూ.. అడ్డంగా ఏసీబీకి పట్టుబడుతున్నారు. జిల్లాలో ఏ ప్రభుత్వ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక కొంతమంది సతమతమవుతుంటే.. మరికొంత మంది చిన్నచిన్న పనులకు 50 నుంచి 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. అనేక వ్యయ ప్రయాసలకోర్చి ఆయా ప్రాంతాల్లోని ఆఫీసులకు చేరుకుంటే తీరా సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది.



టాస్క్‌ఫోర్స్ అధికారుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, మద్యం బాటిళ్లు

ఫాంహౌస్‌లో డ్రగ్స్ కలకలం

- బర్త్ డే పార్టీలో వినియోగించిన ఐటీ ఉద్యోగులు
- దాడి చేసిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు
- పట్టుబడిన ఆరుగురు.. పరారీలో మరో ఇద్దరు
- డ్రగ్స్, విదేశీ మద్యం స్వాధీనం

మొయినాబాద్: డ్రగ్స్ వినియోగిస్తూ బర్త్ డే పార్టీ నిర్వహిస్తున్న ఫాంహౌస్‌పై ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేశారు. ఆరుగురు ఐటీ ఉద్యోగులను పట్టుకుని వారు వినియోగిస్తున్న డ్రగ్స్, విదేశీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి ఫాంహౌస్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో ఉండే ఐటీ ఉద్యోగి అభిజిత్ తన బర్త్ డే పార్టీ నిర్వహించేందుకు మొయినాబాద్ మండల పరిధిలోని మేడిపల్లి రెవెన్యూలో ఉన్న సీరినే ఓర్చర్డ్స్ ఫాంహౌస్‌ను అద్దెకు తీసుకున్నాడు. శనివారం రాత్రి అభిజిత్‌తోపాటు మరో ఏడుగురు ఐటీ ఉద్యోగులు ఫాంహౌస్‌కు వచ్చారు. బర్త్‌డే పార్టీలో భాగంగా డ్రగ్స్, విదేశీ మద్యం వినియోగిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఫాంహౌస్‌పై దాడి చేశారు. అభిజిత్‌తోపాటు సింప్సన్, పార్థు, గోయల్, యశ్వంత్, సేవియో డెన్నిస్‌ను పట్టుకున్నారు. వారి నుంచి రూ.2 లక్షల విలువ చేసే ఎల్‌ఎస్‌డీ బ్లాట్స్, హష్ ఆయిల్ డ్రగ్స్, ఐదు విదేశీ మద్యం బాటిళ్లు, మూడు లగ్జరీ కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు ఐటీ ఉద్యోగులు పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు అథ్లెటిక్స్ పోటీలు

తాండూరు టౌన్: వికారాబాద్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని విభాగాల వయసు క్రీడాకారులకు మంగళవారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మధు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాము ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విలియం మూన్ గ్రౌండ్‌లో ఉదయం 8 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. అండర్–8, 10 విభాగాల్లో బాలబాలికలకు 60 మీటర్ల పరుగు పందెం, బ్రాడ్ జంప్, అండర్–12 విభాగంలో 60 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, అండర్–14 విభాగంలో జావెలిన్ త్రో, అండర్–6,18,20 విభాగాల్లో జావెలిన్ త్రో పోటీలు ఉంటాయన్నారు.



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

సినారె సేవలు మరువలేనివి

తుర్కయంజాల్: తెలుగు సాహిత్యానికి డా.సి.నారాయణ రెడ్డి ఎనలేని సేవలు చేశారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మహాకవి సినారె కళాపీఠం హైదరాబాద్ అధ్యక్షుడు మల్లికేడి రాములు నిర్వహణలో సి.నారాయణ రెడ్డి 94వ జయంతి వేడుకలను ఆదివారం పురపాలక సంఘం పరిధిలోని రాగన్నగూడలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. తెలుగు చలన చిత్ర రంగంలో ఆయన రాసిన ఎన్నో పాటలు అన్ని వర్గాల ప్రజలను అలరించాయని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. నారాయణ రెడ్డి గేయ నాటికలు, పద్య గేయ సంపుటి, దీర్ఘగీతం, గేయ నాటికలు, గేయ కావ్యం, కవితా సంపుటి, వచన కవితా సంపుటి, వ్యాఖ్యానం, నృత్య గేయ రూపకం, సినీగీతాల సంకలనం వంటి ఎన్నో రచనలను చేశారని గుర్తుచేశారు. అనంతరం సినారె జీవన సాఫల్య పురస్కారాన్ని డా. లింగంపల్లి రామచంద్రకు అందజేశారు. సాహిత్య పురస్కారాలను తెలంగాణలోని పది జిల్లాలకు చెందిన డా. నాశేశ్వరం శంకరం, డా. రాధశ్రీ, డా. ఆచార్యా ఫణీంద్ర, కాసుల ప్రతాప్ రెడ్డి, దోరవేటి చెన్నయ్య, మౌన శ్రీ మల్లిక్, జువ్వాడి దేవి ప్రసాద్, తత్వాతి ప్రమోద్ కుమార్, మంథని శంకర్, అగ్రహారం ఛందోజీ రావు, అరుణ నారదభట్ల, పెద్దూరి వెంకటదాసు, పొన్నాల బాలయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేటి నిజం దినపత్రిక సంపాదకుడు బైస దేవదాసు, మాజీ కౌన్సిలర్ కాకుమాను సునీల్, ప్రముఖ సంఘ సేవకులు దాసరి దయానంద్ రెడ్డి, తేజ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు డా. పోరెడ్డి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

మర్పల్లి: మహనీయుల ఆశయాల సాధనకు వారి అడుగుజాడల్లో నడవాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసింతో కలిసి పట్లూరు ఏర్పాటు చేసిన 16 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ నేటి వాస్తవానికి ప్రతీక అన్నారు. దళిత, గిరిజన, బహుజనుల ధైర్యం అని కొనియాడారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో తమ వాటాను పొందుతూ, ప్రజాప్రతినిధులు అవుతున్నారంటే అందుకు కారణం అంబేడ్కర్ అందించిన రిజర్వేషన్ల ఫలమే అన్నారు. తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఉన్నంత కాలం దళిత, గిరిజన, బహుజనలకు ఏ లోటూ ఉండదన్నారు. అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. దేశ చరిత్రలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్ యాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, నాయకులు రాములు యాదవ్, కృష్ణారెడ్డి, కొండల్ రెడ్డి, రవీందర్, రామేశ్వర్, ఫసీయుద్దీన్, సలీం, గణేశ్, సురేశ్, అశోక్, రాజు, అశోక్, రాములు, నందు ప్రకాశ్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ప్రసాద్‌కుమార్, అద్దంకి దయాకర్, ప్రొఫెసర్ కాసిం తదితరులు

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

శంకర్‌పల్లి: హిందూ సామ్రాజ్య స్థాపన కోసం ఛత్రపతి శివాజీ చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. మండలంలోని గోపులారంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఛత్రపతి శివాజీ వ్యక్తిత్వాన్ని, ఆయన పోరాటాలకు సంబంధించిన చరిత్రను చదివి స్ఫూర్తి పొందాలన్నారు. రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. యువత అన్ని మతాల వారిని గౌరవిస్తూనే సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట వీరధర్మాజ స్వామి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ మండలాధ్యక్షురాలు లీలావతి, మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, రాములు, వాసుదేవ్ కన్నా, బయానంద్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న రాంచందర్‌రావు

గెలుపుకోసం కృషి చేయాలి

మొయినాబాద్‌రూరల్: ఎన్నికలు ఎప్పుడు వచ్చిన పార్టీ గెలుపుకోసమే అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. మండలపరిధిలోని అమ్డాపూర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కట్టమైసమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు గొల్లపల్లి రవీందర్ రెడ్డి, సోముల అంజిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, మహేందర్ ముదిరాజ్, నారంరెడ్డి, బాత్కు శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచన తీరు మార్పుతోనే అభివృద్ధి సాధ్యం

ఉప్పల్: ఐ ఫోకస్ సేవలు రాష్ట్రంతో పాటు దేశానికి సైతం ఉపయోగ పడేలా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సమాజంలో మార్పు రావాలంటే మన ఆలోచన తీరు మారాలని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఉప్పల్ శిల్పారామం ఆడిటోరియంలో ఐ ఫోకస్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మైత్రి వారధి-2025' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఐ ఫోకస్ సంస్థ వ్యక్తిగతం కాదు వ్యక్తిత్వాన్ని పెంచే ప్లాట్‌ఫాం అని కొనియాడారు. మనం నడక నేర్చింది మొదలు చివరి శ్వాస వరకు మన కోసమే పరుగులు పెడుతుంటామని, ఈ ప్రయాణంలో సమాజం గురించి ఆలోచించే తీరిక లేకుండా పోతోందన్నారు. సమాజం అంటే కేవలం నలుగురు మనుషులు కాదని, మన చుట్టూ ఉండేవారందరిని గుర్తించాలని సూచించారు. ఒంటరిగా ఉండి ఏమీ సాధించలేమని.. సమష్టిగా అడుగు ముందుకేస్తే మార్పు సాధ్యవుతుందన్నారు.

ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష



సాయం చేసిన సీఐ మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన అభ్యర్థి

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పీజీ నీట్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన పరీక్షకు ఇబ్రహీంపట్నంలోని సిద్ధార్థ, శ్రీఇందు, ఏవీఎన్, శ్రీఇందు, గురునానక్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని రాందాస్‌పల్లి సమీపంలో ఉన్న ఏవీఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కోసం 110 మందిని కేటాయించారు. పరీక్ష సమయానికి ముందుగానే చేరుకున్న గాంధీ మెడికల్ కళాశాల నుంచి వచ్చిన డాక్టర్ నితిన్ పొరపాటున ప్రొవిజనల్ సర్టిఫికెట్ మర్చిపోయాడు. పరీక్ష సమయం దగ్గరపడుతుండడం.. సమీపంలో ఎక్కడా జిరాక్స్ కేంద్రాలు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్‌రెడ్డి తనకారు ఇచ్చి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు పంపించి ప్రొవిజనల్ సర్టిఫికెట్ జిరాక్స్ తీసుకొచ్చి ఇచ్చారు. దీంతో నితిన్, ఆయన తల్లిదండ్రులు సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.





రన్.. రంజితం

ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్‌కు ముందు డ్రైరన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు, ఎన్ఎండీసీ సంయుక్తంగా ఈ మారథాన్‌ను నిర్వహించాయి. నగరంలోని పీపుల్స్‌ప్లాజా, మాదాపూర్‌లో ప్రారంభమైన డ్రై రన్ గచ్చిబౌలి స్టేడియంలో ముగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ దేశంలోనే రెండో అతిపెద్దదిగా గుర్తింపు పొందిందన్నారు. ప్రతిష్టాత్మక ప్రపంచ అథ్లెటిక్స్ లేబుల్ రేస్ ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. – గచ్చిబౌలి

పనిచేసుకోనివ్వడం లేదు.. వీఆర్‌ఎస్ ఇవ్వండి

కమిషనర్‌కు.. బిల్ కలెక్టర్ విన్నపం


శ్రీశైలం, బిల్ కలెక్టర్

హుడాకాంప్లెక్స్: 'ఉన్నతాధికారులు నన్ను పనిచేసుకోనివ్వడం లేదు. నాకు వీఆర్‌ఎస్ ఇవ్వండి' అని బిల్ కలెక్టర్ శ్రీశైలం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు విన్నవించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ సర్కిల్ నం.5లో బిల్ కలెక్టర్‌గా శ్రీశైలం బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇతనికి రెండేళ్లలో నాలుగు డాకెట్లు అప్పగించారు. ప్రస్తుతం 321 డాకెట్ ఇచ్చారు. ఇంకా అతను తీసుకోలేదు. శ్రీశైలం.. కమిషనర్ కర్ణన్‌కు అందజేసిన ఫిర్యాదులో ఉన్నతాధికారులు నెలనెలా హాస్టల్స్, విద్యాసంస్థల ఇనిస్టిట్యూషన్లు, ప్రైవేటు కార్యాలయాలు, కమర్షియల్ కాంప్లెక్సులు తదితరుల వద్ద నెలనెలా మామూళ్లు తీసుకుంటున్నారని, తనను తనిఖీలకు వెళ్లవద్దని బెదిరిస్తున్నారని ఆరోపించారు. పన్నులు వసూలు చేయనియ్యడం లేదని, లైసెన్సు నోటీసు బుక్కు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసులు ఇవ్వబోతే.. డిప్యూటీ కమిషనర్, ఏఎంసీ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్లకు నచ్చడం లేదని పేర్కొంటూ.. శనివారం కమిషనర్ వినతిపత్రం అందజేశాడు. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, అవన్నీ చూపిస్తానని చెప్పారు. ఒకవేళ తాను తప్పు చేస్తే తనపై ఎలాంటి చర్యలైనా తీసుకోవాలని, ఈ టార్చర్ భరించడం తన వల్ల కాదని వాపోయారు. సంబంధిత కాపీని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్, అడిషనల్ కమిషనర్ అడ్మినిస్ట్రేషన్, విజిలెన్స్ సెల్ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం, అన్ని వర్కింగ్ యూనియన్లకు, విలేకర్లకు పంపానని, బిల్డింగ్ ఫొటోస్, నోటీసు అక్నాలెడ్జ్‌మెంట్ కాపీలు కూడా జతచేశానని వెల్లడించారు. ఇదే విషయమై డిప్యూటీ కమిషనర్‌ను వివరణ కోరగా.. అతని వలన కార్యాలయానికి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ట్రేడర్స్, విద్యాసంస్థల యజమానులను దూషిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో వేరే చోట పని చేసినప్పుడు కూడా శ్రీశైలం పనితీరు సరిగ్గా లేదని, ఇక్కడ అలాగే ప్రవర్తిస్తున్నందుకు మార్చాల్సి వచ్చిందని, మరే ఇతర కారణాలు లేవని వెల్లడించారు.

ఇంటి దొంగ పనేనా!

- పోలీసులకు సవాల్‌గా మారిన చోరీ కేసు
- అనుమానాలన్నీ కుటుంబీకులపైనే

నందిగామ: ఇటీవల ఓ ఇంట్లో జరిగిన భారీ చోరీపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేరన్నట్లు.. నాలుగో వ్యక్తికి తెలియకుండా దాచిన నగదు, నగలు అపహరణకు గురయ్యాయి. ఇంట్లో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. కొత్త వ్యక్తి లోపటికి రాలేదు. భద్రపర్చిన పెట్టె ఎక్కడ ఉందో అక్కడే ఉంది. కానీ అవి మాయం అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నందిగామ మండలం మామిడిపల్లి గ్రామంలో చాకలి కృష్ణయ్య.. కూతురు వివాహం కోసమని ఇంట్లో రూ.15 లక్షల నగదు, 16 తులాల బంగారం దాచి ఉంచాడు. జూలై 27న డబ్బులు అవసరం ఉండి పెట్టిన చోటకు వెళ్లి చూడగా.. డబ్బు, నగలు కనిపించలేదు. ఆందోళన చెందిన సదరు వ్యక్తి.. కుటుంబ సభ్యులు, బంధువుల వివరించారు. ఎంత వెతికినా వాటి ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే.

సందేహాలు ఎన్నో..

బాధితుడు కృష్ణయ్య.. భార్య, కూతురుతో నివాసం ఉంటున్నాడు. భార్య కూలీ పనులకు వెళ్తుండగా, కృష్ణయ్య అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్నాడు. తోడుగా కూతురు ఉంటోంది. ఇంట్లో నగదు, నగలు దాచిన విషయం మా ముగ్గురికి మాత్రమే తెలుసునని, తలుపులు, ఇంటి తాళం విరగగొట్టిన దాఖలాలు లేవని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సొత్తు ఉంచిన పెట్టె ఎప్పటిలాగే సజ్జపైనే ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో చడీచప్పుడు లేకుండా.. నగదు, నగలు మాయం కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు విచారణ ముమ్మరం చేసినప్పటికీ.. ఎటూ తేల్చలేక పోతున్నారు. కాగా.. ఈ కేసులో కేశంపేట మండలం పరిధి ఓ గ్రామానికి చెందిన యువకుడి పాత్ర ఉందనే అనుమానంతో ఆ దిశగా పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా.. మామిడిపల్లిలో జరిగిన చోరీ ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. ఎన్ని విధాలుగా పరిశీలించినా.. అనుమానాలన్నీ కుటుంబ సభ్యుల చుట్టే తిరుగుతుండటం విశేషం.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

16 తులాల బంగారు నగల అపహరణ

మొయినాబాద్: వివాహ వేడుకలో పాల్గొని వచ్చేసరికి గుర్తుతెలియని దుండగులు ఇంటిని గుల్ల చేశారు. ఇంటి తాళాలు, బీరువా తాళం పగులగొట్టి 16 తులాల బంగారు నగలు దోచుకెళ్లారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధి పెద్దమంగళారంకు చెందిన సీహెచ్ అనిత, శనివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి వనస్థలిపురంలోని బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా.. తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడుంది. బీరువాలోని బంగారు నగలు కనిపించలేదు. చోరీ జరిగిందని భావించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గృహిణి అదృశ్యం


నజీరా(ఫైల్)

పహాడీషరీఫ్: కుమారుడితో గృహిణి అదృశ్యం అయింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ ఇస్తియాక్ అన్సారీ, నజీరా కాతూన్(25) దంపతులు ముగ్గురు పిల్లలతో కలిసి జీవనోపాధి నిమిత్తం జల్‌పల్లి వాదే ముస్తాఫా బస్తీకి వలస వచ్చారు. ఈ నెల 2న అందరితో కలిసి నిద్రపోయిన నజీరా.. ఉదయం లేచి చూసే సరికి నాలుగు నెలల కుమారుడు జీషాన్‌తో కలిసి కనిపించకుండా పోయింది. అదే రోజున భర్త అన్సారీ.. ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో కానీ, 87126 62367 నంబర్‌కు కానీ సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

నకిలీ సర్టిఫికేటుగాళ్లు..!

గుర్తింపు లేని సంస్థల్లో గుట్టుగా సౌందర్య కోర్సులు



- నగరంలో వందలాది మందికి సర్టిఫికెట్ల జారీ
- మూడు సంస్థలకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నోటీసులు
- 30 మందికి పైగా కేసులు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: వైద్యారోగ్య శాఖలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో రోజుకో కోణం వెలుగులోకి వస్తోంది. నగరంలో ఎలాంటి అర్హత లేని సంస్థలు విచ్చలవిడిగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాయి. అక్రమార్జనే ధ్యేయంగా గత కొన్నేళ్లుగా ఈ అక్రమ దందా నడిపిస్తున్నాయి. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదులు అందడం, తనిఖీల్లో నకిలీ సర్టిఫికెట్లు లభించడంతో కథ అడ్డం తిరిగింది. నగరంలో మూడు సంస్థలు ఎలాంటి అర్హత లేకుండా సర్టిఫికెట్లను జారీ చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో సదరు సంస్థలపై చర్యలకు రంగం సిద్ధమవుతున్నారు.

- జాతీయ మెడికల్ కౌన్సిల్‌లో గుర్తింపు లేని యూనివర్సిటీలు సంస్థలు సర్టిఫికెట్లు జారీ చేయరాదని, అలా చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని కౌన్సిల్ చెబుతోంది. నగరంలో మాత్రం ఈ నిబంధనలు తమకు వర్తించవన్నట్లు ప్రభుత్వ పరంగా ఎలాంటి అనుమతులు లేని సంస్థలు ఏస్తటిక్స్, బ్యూటీ, కాస్మోటాలజీ రంగంలో విచ్చలవిడిగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాయి. దీంతో కాస్మోటాలజీ కేంద్రాల్లో వైద్యులుగా చెలామణీ అవుతున్నారు. గత కొన్ని రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డెంటల్ వైద్యులు, ఇతరులు సైతం స్కిన్ కేర్, హెయిర్, ఇతర సౌందర్య చికిత్సలు అందిస్తున్నట్లు గుర్తించారు. ఇది నిబంధనలకు విరుద్ధమని నిలదీసినపుడు మేం బ్యూటీ కోర్సులు పూర్తి చేశామని పలువురు సర్టిఫికెట్లు చూపించినట్లు తెలుస్తోంది. సర్టిఫికెట్లు చెల్లవనే విషయమై ఫిర్యాదులు అందినట్లు సమాచారం. దీంతో ఆయా సర్టిఫికెట్లు జారీ చేసిన సంస్థలకు ఎన్‌ఎంసీ గుర్తింపు ఉందా? లేదా? అని ఆరా తీశారు. అసలు సర్టిఫికెట్లు నకిలీవా, ఒరిజినలా అనే కోణంలోనూ విచారణ చేపట్టగా గుర్తింపు లేని సంస్థలు అక్రమార్జనే ధ్యేయంగా సాగిస్తున్న అక్రమ దందాగా గుర్తించారు. దీంతో నగరంలోని మూడు సంస్థలపై కేసులు నమోదు చేశారు. అక్రమ పద్ధతుల్లో కాస్మోటాలజీ చికిత్సలు అందిస్తున్న సుమారు 30 మందిపై కేసులు నమోదు చేశారు.

ఆ సర్టిఫికెట్లు చెల్లుబాటు కావు

జాతీయ మెడికల్ కౌన్సిల్‌లో గుర్తింపు పొందిన సంస్థల్లో మాత్రమే కోర్సులు పూర్తి చేయాలి. గుర్తింపు లేని సంస్థలు జారీ చేసిన సర్టిఫికెట్లు చెల్లుబాటు కావు. ఇలాంటి సర్టిఫికెట్లతో ప్రాక్టీస్ చేసే వారిపై ఎన్ఎంసీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం. ఎంబీబీఎస్, ఫాం డీ, బీడీఎస్, బీఎస్సీ, హోమియో చేసిన వారు సర్టిఫికెట్లు తెచ్చుకుంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో కాస్మోటాలజీ సేవలందిస్తున్న 30 మందిపై కేసులు నమోదయ్యాయి. అనధికారిక సంస్థల నుంచి పొందిన సర్టిఫికెట్లతో హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, పీలింగ్, ఏస్తటిక్ సర్జరీలు చేస్తున్నారు. ఇటువంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

– శ్రీనివాస్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి

మేయర్ గద్వాల విజయలక్ష్మి


కర్మాగారం ప్రారంభోత్సవంలో మేయర్ విజయలక్ష్మి

షాబాద్: పరిశ్రమల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. షాబాద్ మండలం చందనవెళ్లి పారిశ్రామిక వాడలో నీలోఫర్ బాబురావు ఏర్పాటు చేసిన నీలోఫర్ టీ పౌడర్ ప్యాకింగ్ కర్మాగారాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అనేక ప్రోత్సాహకాలను అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ టీసీ అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, లింగం, నాయకులు అశోక్, రాఘవేందర్, నర్సింహారెడ్డి, సూర్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరో మహిళ మోజులో పడి..

- భార్యా పిల్లలను ఇంటి నుంచి గెంటేసిన భర్త
- ఇద్దరు పిల్లలతో సహా భర్త ఇంటి ఎదుట బాధితురాలి ఆందోళన


భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న లావణ్య

రామంతాపూర్: మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఓ పోలీస్ కానిస్టేబుల్ భార్యా పిల్లలను ఇంటి నుంచి గెంటేయడంతో ఆమె ఇద్దరు పిల్లలతో సహా భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టిన సంఘటన ఉప్పల్ పీఎస్ పరిధిలోని రామంతాపూర్ వెంకటరెడ్డినగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. బాధితురాలు లావణ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కటకం లావణ్యకు స్పెషల్ పోలీస్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కటకం నాగరాజుతో 2009తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. గత కొన్నాళ్లుగా నాగరాజు మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఆమెతో కలిసి వెంకటరెడ్డినగర్‌లో ఉంటున్నాడు. ఈ విషయం తెలియడంతో లావణ్య ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం రాత్రి భర్త ఉంటున్న ఇంటికి వెళ్లి అతడిని నిలదీయగా నాగరాజు ఆమెను బయటికి గెంటేసి తాళం వేసుకున్నాడు. దీంతో ఆమె శనివారం రాత్రి నుంచి అదే ఇంటి ముందు ఆందోళన చేపట్టింది. దీనిపై ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా గతంలో ఇదే విషయమై మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పిన పోలీసులు తనను తిరిగి పంపారని తెలిపింది. తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసులను డిమాండ్ చేసింది.


యూట్యూబ్‌లో వీడియోలు బ్లాక్ చేశారని ఫిర్యాదు

నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: తాము పాట రాసుకుని పాడి వీడియోలు చిత్రీకరించుకుని రూ. లక్షలు ఖర్చు చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలను మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి తమకు తెలియకుండా డౌన్‌లోడ్ చేసుకుని తమ వీడియోను బ్లాక్ చేశారంటూ ఐదుగురు యూట్యూబర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2 జవహర్‌కాలనీకి చెందిన రమావత్ విజయ్ అనే యూట్యూబర్..విజయ్ ఆడియోస్ అండ్ వీడియోస్ పేరుతో తానే పాటలు పాడి వీడియో చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. అతడికి 6 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. అయితే మహారాష్ట్రకు చెందిన విశాల్‌రాథోడ్ అనే వ్యక్తి విజయ్ అప్‌లోడ్ చేసిన వీడియోలను డౌన్‌లోడ్ చేసుకుని తానే వీటిని రూపొందించినట్లుగా ఫ్రెష్‌గా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి విజయ్ వీడియోలను బ్లాక్ చేశాడు. విజయ్‌తో పాటు బనావత్ ఆంజనేయులు, అరవింద్, రమావత్ నితిన్, సాయికుమార్ అనే యూట్యూబర్ల వీడియోలు కూడా డౌన్‌లోడ్ చేసుకుని వీటిని బ్లాక్ చేసి తానే వీటిని నిర్మించినట్లుగా విశాల్ రాథోడ్ అప్‌లోడ్ చేయసాగాడు. దీంతో అసలైన యూ ట్యూబర్లు నష్టాలు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని విశాల్ దృష్టికి తీసుకెళ్లగా తిరిగి వీడియోలు అప్‌లోడ్ కావాలంటే అన్‌లాక్ చేసేందుకు రూ.10 లక్షలు డిమాండ్ చేస్తున్నాడని, తమను బెదిరింపులకు గురిచేస్తున్నాడంటూ విజయ్‌తో పాటు నలుగురు యూట్యూబర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది కాపీరైట్ చట్టం కిందికు కూడా వస్తుందని, చీటింగ్ చేయడమేగాక, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నాడని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్కో వీడియో చిత్రీకరించడానికి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేశామని, తమ వీడియోలను బ్లాక్ చేయడం ద్వారా భారీగా నష్టపోతున్నామని ఆరోపించారు. విశాల్‌పై బంజారాహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ కాల్‌తో స్పందించారు.. బాలికను కాపాడారు..

- ఒడిశా నుంచి సమాచారం
- అప్రమత్తమై బాలికను కాపాడిన బాచుపల్లి పోలీసులు


బాలికతో పోలీస్ సిబ్బంది

నిజాంపేట: బాచుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్‌కు శనివారం ఒడిశాలోని కటక్ నుంచి ఓ ఫోన్ వచ్చింది. దక్షిణాసియా మహిళా ఫౌండేషన్‌లో ప్రోగ్రాం ఆఫీసర్‌గా పని చేస్తున్న తాన్వి సింగ్ అనే వ్యక్తి ఫోన్ చేసి ఒడిశా రాష్ట్రం, కేంద్రపాడా జిల్లా, ఔల్ మండలం, సహిరా గ్రామానికి చెందిన బాలిక(16) అపహరణకు గురైందని, ఆమెను బాచుపల్లిలోని ఓ ఇంట్లో నిర్బంధించినట్లు సమాచారం అందించాడు. దీంతో తక్షణమే స్పందించిన ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ గాలింపు చర్యలు చేపట్టారు. స్థానికుల సహకారంతో కొద్ది గంటల్లోనే బాలికను ఇందిరానగర్‌లోని ఓ ఇంట్లో బంధించినట్లు గుర్తించి రక్షించారు. అనంతరం ఆమెను సూరారంలోని సఖి సెంటర్‌కు తరలించారు. ఆమె తల్లిదండ్రులు లేదా ఒడిశా పోలీసులకు అప్పగించే వరకూ తాత్కాలిక రక్షణలో ఉంచనున్నట్లు ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు.

గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందాలు దాడులు నిర్వహించి గంజాయి, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న 6.15 కిలోల గంజాయిని రైల్వే పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకున్నారు. సరూర్‌నగర్ గుర్రంగూడ ప్రాంతంలోని ఒక ఇంట్లో గంజాయి పెంచుతున్నట్లు సమాచారం అందడంతో డీటీఎఫ్ పోలీసులు నిర్వహించగా మూడు గంజాయి మొక్కలు లభించాయి. సికింద్రాబాద్ రసూల్ పుర ప్రాంతంలో 1.60 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురి పైనా కేసులు నమోదు చేశారు.

గండిపేట చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మణికొండ: గండిపేట చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. నార్సింగి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గండిపేట చెరువులో చేపలు పట్టేందుకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి(40) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఆదివారం చెరువు నీటి మట్టాన్ని పరిశీలించేందుకు వచ్చి జలమండలి ఉద్యోగి మునీర్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతి ఒంటిపై తెల్ల టీషర్టు, బ్రౌన్ కలర్ డ్రాయర్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

రిజర్వేషన్ల సాధనకు బీసీలు కదిలి రండి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి హన్మంతుముదిరాజ్

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తుంటే కేంద్రం అడ్డుకుంటోందని కేంద్రంపై కొట్లాడేందుకు బీసీలు కదిలి రావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి హన్మంతుముదిరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర కేబినెట్ బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్‌కు పంపిస్తే బీజేపీ అడ్డుకుంటోందన్నారు. ఈ నెల 5,6,7 తేదీల్లో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంపై కొట్లాడి బీసీ రిజర్వేషన్లు సాధించుకునేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. రాష్ట్రంలోని బీసీలు ప్రభుత్వానికి మద్దతు తెలిపి నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

జాలీగా.. అ'పూర్వ' కలయిక

శంషాబాద్: మూడు దశాబ్దాల క్రితం పదో తరగతి చదువుకున్న అలనాటి స్నేహితులంతా ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కలిశారు. నాటి స్నేహితులు ఒకే చోటి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని మురిసిపోయారు. శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993వ సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఎంజాయ్ చేశారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇటీవల ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన తమ తోటి స్నేహితుడు సంకూరి జయప్రకాశ్‌ను ఘనంగా సన్మానించారు. శారీక వైకల్యంతో బాధపడుతున్న మరో స్నేహితుడు భాస్కరాచారికి ఆర్థికంగా సాయం అందజేసి మేమున్నామంటూ భరోసానిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది ఎస్.వెంకట్‌రెడ్డి, డాక్టర్ ఎ.కృష్ణ, భాగ్యలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, సరిత, రజిత, బి.వరలక్ష్మి, పద్మావతి, ఎస్.కిరణ్, మహ్మద్ ఆసిఫ్, లక్ష్మణ్‌ప్రసాద్, టి.నర్సింహా, చందు,మహేందర్,దాసు,సాయిబాబా, సత్యనారాయణ, యూసుఫ్, నర్సింగ్‌రావు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


దూబే(ఫైల్)

కొత్తూరు: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు దూబే.. పదేళ్లుగా కొత్తూరులో నివాసం ఉంటున్నాడు. ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంటినుంచి వెళ్లిపోయిన సదరు వ్యక్తి.. గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ మాస్టర్ రేమత్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నందిగామలో.. మరొకరు

నందిగామ: బహిర్భూమికి వెళ్లిన వ్యక్తిని రైలు ఢీ కొట్టగా.. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన నందిగామ శివారు హెచ్‌బీఎల్ పరిశ్రమ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఐజాక్ తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి మండలం కడ్లాపూర్ గ్రామానికి చెందిన దాడువై అంజయ్య(57) కాలకృత్యాలు తీర్చుకునేందుకు రైలు పట్టాల పక్కకు వెళ్లి తిరిగి వస్తుండగా.. గుర్తు తెలియని రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ మాస్టర్ ఎండీ ఉబెద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

ఫోన్ అప్పగింత



రోగి బంధువుకు ఫోన్ అందజేస్తున్న 108 సిబ్బంది

మహేశ్వరం: 108లో మరిచిపోయిన మొబైల్ ఫోన్‌ను.. అంబులెన్స్ సిబ్బంది రోగి బంధువుకి అప్పగించి నిజాయతీని చాటు కున్నారు. కందుకూరు మండలం మీర్కాన్‌పేట్ గ్రామానికి చెందిన నందిగామ లక్ష్మమ్మ(75) అనారోగ్యానికి గురి కావడంతో బంధువులు అంబులెన్స్‌లో చికిత్స కోసం తరలించారు. ఆస్పత్రికి తరలించే క్రమంలో రోగి బంధువులు.. తమ ఫోన్‌ను వాహనంలో వదిలి వెళ్లిపోయారు. మండల కేంద్రం చేరుకున్న వాహన సిబ్బంది.. సెల్‌ను గమనించి రోగి బంధువులకు సమాచారం అందించి అప్పగించారు. దీంతో ఈఎంటీ కుమార్, పైలట్ యాదయ్యను వారు అభినందించారు.

పోగొట్టుకున్న డబ్బును కెమెరా పట్టించింది

ఆమనగల్లు: ఓ వ్యక్తి పోగొట్టుకున్న పర్సును సీసీ కెమెరా పట్టించగా.. ఆ పర్సును పోలీసులు ఆదివారం బాధిత వ్యక్తికి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. తలకొండపల్లికి చెందిన లక్ష్మయ్య తన పర్స్‌లో రూ.16 వేలు పెట్టుకుని, గ్రామీణ వికాస్‌బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు వెళ్తుండగా.. మార్గమధ్యలో పడిపోయింది. బ్యాంక్‌కు వచ్చి చూసుకోగా.. కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. సదరు వ్యక్తి ఫిర్యాదుతో ఎస్ఐ శ్రీకాంత్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ శ్రీనివాస్, శివుడులు ఆయా మార్గంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. రోడ్డుపై పడిపోయిన పర్స్‌ను బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తీసుకున్నట్లుగా గుర్తించారు. బైక్ నంబర్ ఆధారంగా వారిని గుర్తించి, పర్సు, అందులోని డబ్బును రికవరీ చేశారు. అనంతరం బాధితుడు లక్ష్మయ్యకు అందజేశారు.

రిజర్వేషన్లు ప్రకటించకపోతే ఎన్నికల బహిష్కరణ

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్కకృష్ణ యాదవ్

షాద్‌నగర్‌రూరల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించకపోతే సర్పంచ్ ఎన్నికలను బహిష్కరిస్తామని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్కకృష్ణ యాదవ్ అన్నారు. ఆదివారం సేన ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు షాబాద్‌రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో లింగారెడ్డిగూడ గ్రామ సేన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. జనాభాలో బీసీలుఅధిక శాతం ఉన్నారని, రిజర్వేషన్లలో సముచిత స్థానం కల్పించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని పేర్కొన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శంకరయ్య యాదవ్, ఉపాధ్యక్షులుగా అశోక్, మల్లేశ్, వంశరాజ్, ప్రధాన కార్యదర్శులుగా వీరేష్‌గౌడ్, పోచయ్య, శ్రీకాంత్‌తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్, చంద్రశేఖరప్ప, పాలాది శ్రీనివాస్, జయమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఢీ కొరియో గ్రాఫర్ కృష్ణ అరెస్ట్

గచ్చిబౌలి: పోక్సో కేసులో ఢీ షోలో కొరియో గ్రాఫర్‌గా వ్యవహరించిన కృష్ణను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నమ్మకంగా ఉంటూ స్నేహితుడి కూతురిపై లైంగిక దాడికి యత్నించినట్లు ఫిర్యాదు అందడంతో గచ్చిబౌలి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు కృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.